నమస్తే తెలంగాణ

కామారెడ్డి

3 | నిజామాబాద్, ఆదివారం 18 ఆగస్టు 2024 | KAMAREDDY

- రుణమాఫీ కోసం ఆగమాగం
- సర్కారు మోసం చేసిందంటున్న రైతులు
- వేల్పూర్‌లో రుణమాఫీ కోసం భారీ రైతు ధర్నా
- జాతీయ రహదారిపై మాజీ మంత్రి వేముల బైఠాయింపు
- ఉమ్మడి జిల్లాలో 2లక్షల 4వేల మందికి ధోకా చేసిన సర్కారు

ధర్నాకు తరలివచ్చిన బాల్కొండ నియోజకవర్గ రైతులు

వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ధర్నాలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

రైతు రుణం

రోడ్డెక్కిన అన్నదాత

సీఎంకు బాల్కొండ రైతుల లేఖ



రుణమాఫీ విషయంలో శనివారం వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో రైతుల అనుమతితో సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను పంపిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. ఆ లేఖను ధర్నాలో రైతులకు చదివి వినిపించారు.

-మోర్తాడ్, ఆగస్టు 17

లిస్టులో పేరు చూసుకొని పొండ్రి అంటుండ్రు

మోర్తాడ్, ఆగస్టు 17 : బ్యాంకులకు వెళ్తే లిస్టులో పేరు చూసుకొని పొండ్రి అంటుండ్రు. మమ్మల్ని సతాయించ కుండ్రి అంటుండ్రు. నాకు బ్యాంకులో రూ.2.20లక్షల రుణం ఉన్నది. రూ.2లక్షల రుణం ఆగస్టు 15 వరకు ఇస్తామని సీఎం చెప్పడంతో మూడో దఫా లిస్టుకోసం ఎదురు చూశాను. కానీ మూడో లిస్టులో కూడా పేరు రాలేదు. ఎందుకు రాలేదో తెలియడం లేదు. రుణమాఫీ వస్తుందా రాదా అనే విషయం అనుమానంగా ఉన్నది. కుటుంబానికి ఒకరికి రూ.2లక్షల రుణమాఫీ ఇస్తామన్నారు.

- దుగ్గెన రాజేందర్, రైతు, ధర్మోరా

మూడు విడుతల్లో రాలేదు

నాకు రూ.1.40లక్షలు, నా భార్యకు రూ.లక్ష రుణం ఉన్నది. మూడు విడుతలో కూడా మాకు రుణమాఫీ రాలేదు. బ్యాంకులోకి వెళ్లి అడిగితే రాలేదని చెప్తుండ్రు. ఇద్దరికీ కలిపి రెండు లక్షల రుణమాఫీ ఇస్తారని అనుకున్న. మూడు విడుతలు అయిపోయినాయి.. ఇంకా ఇస్తరో ఇయ్యరో అనుమానమే.

- నాగిరెడ్డి రాజరెడ్డి, రైతు, దోంచంద

ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలి..

వేల్పూర్, ఆగస్టు 17 : గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం షరతులతో కూడిన రుణమాఫీ చేస్తున్నది. ఇది సరైంది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలి.

- జైడి గంగారెడ్డి, మోతె, వేల్పూర్

మూడు విడుతల్లో మాఫీ వివరాలు..

జిల్లా	రైతులు	మాఫీ పొందిన రైతులు	కేటాయించిన డబ్బులు
నిజామాబాద్	2,03,520	83,061	రూ.620కోట్లు
కామారెడ్డి	1,76,000	92,640	రూ.655కోట్లు

రైతు రుణమాఫీ కాదు.. అబద్ధపు మాఫీ

- రైతులను రోడ్డుపైకి తెచ్చిన కాంగ్రెస్...
- షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఆగస్టు 17: రైతులందరికీ రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ పార్టీ అబద్ధపు మాఫీ చేసిందని, దేవుళ్లపై ప్రమాణం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి రైతుల్ని మోసం చేశారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గ రైతులతో వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద శనివారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాలో వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులను నమ్మించి మోసం చేశాడని, గాలి మాటలు చెప్పి రైతులను మళ్లీ కలెక్టరేట్ చుట్టూ తిప్పుతున్నారన్నారు. దేవుడు లాంటి కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రవ్యాప్తంగా రైతులను రోడ్డుపై కూర్చోబెట్టిన ప్రభుత్వం మీదని, రైతును రాజును చేసేందుకు రైతువేదికలు కట్టిన ప్రభుత్వం మాదని అన్నారు. రేవంత్‌రెడ్డి రూ.2లక్షలు మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేసి ఓట్లు వేసిన ప్రజల గొంతు కోశారన్నారు. డిసెంబర్ 9వరకు మాఫీ అని చెప్పి మాట తప్పారని, రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలో ప్రశ్నిస్తే వంద రోజుల్లో చేస్తామన్నారు. మాఫీ కానీ రైతులు కలెక్టరేట్‌కు పోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 22 లక్షల మందికి రుణమాఫీ కాలేదన్నారు. ధర్నా సందర్భంగా పోలీసుల తీరుపై మంత్రి స్పందించారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నామని, వచ్చే ప్రభుత్వం తమదేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నదని పోలీసులు హద్దు మీరితే తాను రెడ్ డైరీ మెయింటైన్ చేస్తున్నానని, అధికారంలోకి రాగానే గుణపాఠం చెప్పక తప్పదన్నారు.

నిజామాబాద్, ఆగస్టు 17
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

రుణమాఫీ ప్రక్రియ సంపూర్ణం కావడంతో ప్రయోజనం చేకూరని రైతన్నలంతా రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ నియోజకవర్గం ఆలూర్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున రైతన్నలంతా కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ధర్పల్లిలోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఇదిలా ఉండగా బాల్కొండ నియోజకవర్గంలోనూ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సారథ్యంలో భారీగా రైతు ధర్నా జరిగింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతన్నలందరికీ రుణమాఫీ చేయాలంటూ డిమాండ్ చేశారు. నవీపేట మండలం జన్నేపల్లిలోనూ సిండికేట్ బ్యాంకు వద్ద రైతులు నిరసన ప్రదర్శన చేశారు.

పత్తాలేని జిల్లా వ్యవసాయాధికారి...

రుణమాఫీ గందరగోళంలో రైతులకు సావధానంగా సమాధానం చెప్పాల్సిన వ్యవసాయ శాఖ నిజామాబాద్ జిల్లాలో మొద్దు నిద్రను ప్రదర్శిస్తున్నది. ప్రభుత్వ పెద్దలతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సైతం వ్యవసాయ శాఖకు మార్గనిర్దేశనం చేశారు. రుణమాఫీ రాని రైతులకు అండగా నిలవాలని వారి అనుమానాలు నివృత్తి చేయాలంటూ సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డిలతోపాటు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సైతం ఆదేశాలు ఇచ్చారు. కానీ నిజామాబాద్ వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పత్తా లేకుండా పోయారంటూ రైతులు వాపోతున్నారు. మండల స్థాయిలో వ్యవసాయాధికారులు ఫోన్లు ఎత్తడం లేదని, కనీసం సమాధానం ఇవ్వడానికి ఇష్టపడడం లేదంటూ వాపోతున్నారు. కలెక్టర్ చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పూర్తిగా భిన్నమైన దుస్థితి కనిపిస్తున్నదంటూ రైతులు వాపోతున్నారు. రుణమాఫీ కోసం గట్టిగా నిలదీస్తే వ్యవసాయాధికారులు చేతులెత్తేస్తున్నారని రైతులు చెబుతున్నారు. బ్యాంకర్లను అడగాలంటూ తప్పించుకొని తిరుగుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో ఇంతటి ఘోరమైన దుస్థితిని చూడలేదని తమ అనుభవాలను గుర్తు చేసుకుంటున్నారు.

రుణమాఫీ రాని వారు 2లక్షల మంది..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రుణమాఫీ వర్తించని రైతుల సంఖ్య అక్షరాల 2లక్షల 4వేల మంది వరకు ఉంటారని అంచనాలు వినిపిస్తున్నాయి. 2016లో కేసీఆర్ హయాంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3లక్షల 79వేల 520 మంది రైతులకు రూ.1571. 25 కోట్లు మేర రుణాలను రద్దు చేశారు. రెండోసారి కేసీఆర్ సర్కారు ఏర్పడిన తర్వాత ఇదే స్థాయిలో పెద్ద ఎత్తున రైతులకు రూ.లక్షలోపు రుణాలను రద్దు చేశారు. రూ.2లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారులో అరకొరగానే వర్తించింది. మొత్తం అర్హులైన రైతుల సంఖ్య 3లక్షల 79వేల 520 మంది కన్నా ఎక్కువగా ఉంటే కేవలం లక్షా 75వేల 701 మందికి మాత్రమే మాఫీ వర్తించినట్లుగా లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ మొత్తం కేవలం రూ.1281కోట్లు మాత్రమే. రూ.లక్షలోపు రుణాలను కేసీఆర్ హయాంలో 2016లో రూ.1571కోట్లు వెచ్చించాల్సి రావడం విశేషం.

ఆలూర్ మండల కేంద్రంలో కెనరా బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి

కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి రైతువేదికలో నిరసన తెలుపుతున్న తిమ్మక్‌పల్లి రైతులు

వేల్పూర్ ఎక్స్ రోడ్డుపై బైఠాయించిన రైతులు, నిలిచిన వాహనాలు

ఏమంటారు పెద్దమనిషి...

రైతుల సంక్షేమం కోసం తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అంటున్నారని, ప్రస్తుతం రైతులందరూ రుణమాఫీ రాలేదని రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్నారని, ఇప్పుడేమంటారు పెద్దమనిషి అంటూ ఎమ్మెల్యే వేముల ప్రశ్నించారు. రైతుల ఆగ్రహానికి సీఎం రేవంత్‌రెడ్డి కొట్టుకుపోతారని... మీరు ఆ పార్టీలో ఉంటే ఆయనతోపాటు మీరు కూడా కొట్టుకుపోతారని.. ఒకసారి ఆలోచించాలని పోచారానికి వేముల హితవుపలికారు. ఒకసారి ఆలోచించాలని వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా రైతులంతా పోచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వీడిన పోచారాన్ని మళ్లీ పార్టీలోకి తీసుకోవద్దని నినాదాలు చేశారు.

మిగతా 2.04లక్షల మందికి మాఫీ చేయాలి..

ఉమ్మడి జిల్లాలో 3,79,000 మంది రుణాలు తీసుకుంటే 1,70,000 మందికి మాఫీ చేశారని, మిగిలిన 2,04,000 మందికి మాఫీ చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. జిల్లాకు రూ.1,281 కోట్లు మాత్రమే మాఫీ చేశారని, 2016లో కేసీఆర్ రూ.లక్షలోపు చేస్తే రూ.1,571 కోట్లు మాఫీ అయ్యాయని గుర్తు చేశారు. ఎనిమిదేండ్ల క్రితం కేసీఆర్ చేసిన దాంట్లో సగం మాఫీ కూడా రేవంత్‌రెడ్డి చేయలేదని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 47,070 మంది రైతులుంటే 15,849 మందికి రుణమాఫీ కాలేదన్నారు.

అందరికీ రుణమాఫీ చేయాలి

మోర్తాడ్, ఆగస్టు 17: ప్రతి రైతుకూ రూ.2లక్షల రుణమాఫీ చేయాలి. నాకు మూడు దఫాల్లో రుణమాఫీ రాలేదు. నా పేరు మీద రూ.2.21లక్షలు, నా భార్య పేరు మీద లక్ష బ్యాంకుల్లో రుణం ఉంది. మా ఇద్దరిలో ఎవరికీ రుణమాఫీ రాలేదు. మూడు విడుతల్లో ఇచ్చిన రుణమాఫీ లిస్టులో మా పేరు లేదు. ఎందుకు రాలేదన్న విషయంలో ఇప్పటి వరకు మాకు కచ్చితమైన సమాధానం లభించలేదు.

- సత్యంరెడ్డి, రైతు, చౌట్‌పల్లి

రుణమాఫీ రాలేదు

నాకు బ్యాంకులో రూ.3లక్షల రుణం ఉన్నది. రెండు లక్షల రుణమాఫీ వస్తదని అనుకున్న కానీ లిస్టులో పేరు రాలేదంటుండ్రు. బ్యాంకులకు వెళ్తే లిస్టులో పేరు ఉంటేనే రావాలని, మమ్మల్ని ఎందుకు సతాయిస్తారని అంటున్నరు. బ్యాంకులో రూ.3లక్షల రుణం ఉన్నందున రూ.2లక్షల రుణం వస్తుందనుకున్న కానీ అదికూడా రాలే. వస్తదో రాదోనని అనుమానంగా ఉన్నది.

- బబ్బురు నర్సయ్య, రైతు, శెట్‌పల్లి

నవీపేట మండలం జన్నేపల్లిలో కెనరా బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ఈసారి వస్తదనుకున్నా రాలే

నాకు బ్యాంకులో రూ.2లక్షల రుణం ఉన్నది. ఈసారి మాఫీ వస్తదనుకున్నా కానీ రాలేదు. లిస్టులో పేరు లేదని చెప్తుండ్రు. మొదటి, రెండు విడుతల్లో రూ.లక్షా50వేల లోపు వారికి ఇస్తున్నారని చెప్పడంతో మూడోసారి నాకు తప్పకుండా మాఫీ వస్తుందనుకున్న. గతంలో లేని ఆంక్షలు పెట్టడం.. రైతులకు శాపంగా మారింది.

- నద్పోల్ల హన్మంత్‌రెడ్డి, రైతు, దోంచంద

ప్రభుత్వం ఆదుకోవాలి..

నాకు రెండు ఎకరాల పొలం ఉన్నది. వ్యవసాయమే చేసుకుంటూ బతుకుతాం. రూ.1.05లక్షల రుణాన్ని ఎడపల్లి సిండికేట్ బ్యాంకులో తీసుకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసిన రుణాల జాబితాలో నా పేరు లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- మెగావత్ సంతోష్, ఒడ్డపల్లి, ఎడపల్లి మండలం

నాగిరెడ్డిపేటలోని వ్యవసాయ కార్యాలయంలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు